క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రసన్నను కలిసిన ఖలీల్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పూలమొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట నగర నియోజకవర్గ కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

యాత్ర-2 సినిమాను వీక్షించిన మేయర్



నెల్లూరు(బారకాసు): నగరంలోని ఎస్-2 థియేటర్‌లో యాత్ర-2 చిత్ర ప్రదర్శనను మేయర్ స్రవంతిజయవర్ధన్ కార్పొరేటర్లు విజయలక్ష్మి, వాసంతి, అమృత, కో-ఆప్షన్ సభ్యులు మొబీనాతో కలిసి శుక్రవారం వీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ యాత్ర-2 సినిమా బాగుందన్నారు. దివంగత సీఎం వైఎస్సార్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలు పులకింపజేశాయని, భావోద్వేగాలు పండించాయని పేర్కొన్నారు. వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

‘బన్నిగాడి ప్రేమకథ’ బ్రోచర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సమీపంలోని 25 కళాసంఘాల చాంబర్‌లో ‘బన్నిగాడి ప్రేమకథ’ చిత్రం బ్రోచర్లను ఆ కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రముఖదర్శకుడు దాసరి నారాయణరావు వద్ద సహాయదర్శకుడిగా పనిచేసిన కువ్వారపు నాగేశ్వరరావు దర్శకత్వంలో పరమేశ్వర ఆర్ట్స్ టీం నిర్మిస్తున్న ‘బన్నిగాడి ప్రేమకథ’ చిత్రం పూజా కార్యక్రమం రంగనాయకులపేట రంగనాథస్వామి సన్నిధిలో ఆదివారం ఉదయం 9 గంటలకు జరుగనుందన్నారు. కువ్వారపు కుమారుడు భవానీశంకర్ హీరోగా, రూపారెడ్డి హీరోయిన్‌గా చిత్రం నిర్మితమవుతుందన్నారు. దర్శకుడు కువ్వారపు మాట్లాడుతూ లవ్, హారర్ కథాంశంగా చిత్రం రూపుదిద్దుకుంటుందన్నారు. నెల్లూరు నటీనటులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల నటీనటులు తమను సంప్రదించవచ్చన్నారు. కథానాయకి రూపారెడ్డి, లింబోచిత్ర దర్శకుడు సుధాకర్‌రెడ్డి, నిర్మాత కోడూరు శైలజ, డీఓపీ వెంకీ, 25కళాసంఘాల కన్వీనర్లు దొర్నాల హరిబాబు, అమీర్‌జాన్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, భాస్కర్, సాయి, చిత్రయూనిట్ పాల్గొన్నారు.

వేదగిరి క్షేత్రంలో పొన్నం కుటుంబ సభ్యులు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామిని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజులతో పాటు కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, దేవాదాయశాఖ సిబ్బంది ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. శ్రీవారు, ఆదిలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సోమశిల భద్రతకు చర్యలు తీసుకోవాలని వినతి



నెల్లూరు(దర్గామిట్ట): సోమశిల జలాశయం భద్రతకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వో లవన్నకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. రెండేళ్ల క్రితం వచ్చిన వరదలకు సోమశిల జలాశయం ముందు భాగంలోని ఆఫ్రాన్, స్పిల్‌వే, కాంక్రీట్ దిమ్మెలు, రక్షణ గోడలు దెబ్బతిన్నాయని తెలిపారు. రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ అధికారులు దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం రూ.120 కోట్లతో ఆఫ్రాన్ పనులు ప్రారంభించారన్నారు. ఈ పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారని తెలిపారు. సోమశిల జలాశయాన్ని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సభ్యులు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసి పరిరక్షణకు చర్యలు తీసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నాయకులు దాసరి రాజేంద్రప్రసాద్, మారం కృష్ణ, కంచర్ల నారాయణయాదవ్, రఘురామయ్య, బీ నారాయణరావు, బెల్లంకొండ రామకృష్ణ ఉన్నారు.



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే అనిల్, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, తదితరులు

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం): శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లోని సాయి దర్బార్ అద్దాల మందిరం వద్ద శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. సంప్రదాయంగా దేవదేవేరుల ఉత్సవమూర్తులను బాలాజీనగర్‌లోని సీతారామమందిరం నుంచి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం టీటీడీ అర్చకులు, ఆంధ్రప్రదేశ్ అర్చక శిక్షణా కేంద్రం డైరెక్టర్ ఎస్ తనూజవిష్ణవర్ధన్ ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి పొన్నం మంజుల దేవదేవేరులకు పట్టు వస్త్రాలను సమర్పించారు. వికాస్ ప్రజాహిత సేవా సమితి అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, జ్యోతి దంపతులు ముత్యాల తలంబ్రాలను అందజేశారు. నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, ఆనం జయకుమార్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కల్యాణోత్సవానికి హాజరై వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. టీటీడీ బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాత వై శైలజ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు జమ్మలమడక బాలార్క భక్తిసంకీర్తనలు ఆలపించారు. వికాస్ ప్రజాహిత సేవాసమితి, బాలాజీనగర్ శ్రీసీతారామ స్వామి మందిర కమిటీ నిర్వాహకులు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రచార సామగ్రి రేట్లను నిర్ధారించండి



నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు వినియోగించే వివిధ రకాల ప్రచార సామగ్రి రేట్లను నిర్ధారించాలని జేసీ ఆదర్శ రాజేంద్రన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రింటర్లు, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సామగ్రికి సంబంధించి అధికారులు సేకరించి రూపొందించిన ధరలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. వాటిని పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. రాజకీయపార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తుదిరేట్లను నిర్ధారించి ఎన్నికల ప్రచారంలో వర్తింపజేస్తామన్నారు. డీఆర్వో లవన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు బీ శ్రీనివాసులు, ఎస్‌కే రసూల్, సురేంద్రబాబు, శ్రీరాం డిప్యూటీ కమిషనర్ లేబర్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

• నగర నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్‌అహ్మద్



మాట్లాడుతున్న ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ నగర నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్ కోరారు. నగరంలోని నజీర్‌తోటలోని షాదీ మంజిల్ 8,10,11 డివిజన్లకు సంబంధించిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వ సేవల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. నగర నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రజలకు ఏ కష్టం వచ్చినా సహాయసహకారాలు అందిస్తున్నారన్నారు. ఆయన పార్టీకి చేస్తున్న కృషిని గుర్తించి, రాష్ట్రంలో ఎక్కడ పోటీ చేసినా గెలుస్తారన్న ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన్ని నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారన్నారు. నగర నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. మాజీ మంత్రి నారాయణ నాలుగున్నరేళ్లు కనిపించకుండా ప్రస్తుతం ప్రజల వద్దకొచ్చి తానే నగరాన్ని అభివృద్ధి చేశానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషిచేయాలన్నారు. కార్పొరేటర్లు మొగుళ్లపల్లి కామాక్షిదేవి, కిన్నెర ప్రేమ్‌కుమార్, గోతం అరుణ, పార్టీ నాయకులు కిన్నెర ప్రసాద్, దొంతాల రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వేగవంతం చేయండి

• కమిషనర్ వికాస్‌మర్మత్



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): సచివాలయాల పరిధిలోని అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని 36/2, 3 మూలాపేట, ఫత్తేఖాన్‌పేట, 38/1, 2 అక్కనవారివీధి, శోధన్‌నగర్ వార్డు సచివాలయాలను కమిషనర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పెండింగ్ సేవలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని, నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రూ.150 కోట్లతో రూరల్‌లో అభివృద్ధి పనులు



38వ డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటిస్తున్న విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పది నెలల్లోనే రూ.150 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 38వ డివిజన్‌లో కార్పొరేటర్ దాసరి అమృత దంపతులతో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. సీసీరోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి మాట్లాడుతూ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. అందులో భాగంగానే 38వ డివిజన్ పరిధిలోని రెడ్‌క్రాస్ సంస్థ సమీపంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ. 20 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. డివిజన్ నాయకులు అలీమ్, సందానీబాషా, సునీల్, రాజా, చింటూ, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు హరిబాబుయాదవ్, కోడూరు కమలాకర్‌రెడ్డి, ఏసునాయుడు, శ్రీధర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శివారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించండి

• కమిషనర్ వికాస్‌మర్మత్



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): తుది ఓటరు జాబితా విడుదలైన తరువాత ఆన్‌లైన్ ద్వారా అందుకున్న ఫారం 6,7,8 ఓటరు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో త్వరితగతిన విచారించి జాబితాలో సవరణలు చేయాలని ఎన్నికల విభాగాధికారులను కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ) భవనంలోని సమావేశ మందిరంలో ఎన్నికల విభాగాధికారులు, సూపర్‌వైజర్లతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విచారణ చేసిన దరఖాస్తులను సవరణ కోసం పైస్థాయి అధికారులకు, తదుపరి ఈఆర్వో, కమిషనర్ లాగిన్‌కు పంపాలని సూచించారు. విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఈఆర్వోలు వెంకటేశ్వర్లు, దేవీకుమారి, ప్లానింగ్ అధికారులు ధనుంజయరెడ్డి, దశయ్య, సూపర్‌వైజర్లు చక్రపాణి, ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బంగారు గరుడసేవ



నెల్లూరు(బృందావనం): తై అమావాస్య సందర్భంగా రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బంగారు గరుడసేవను శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి బంగారు గరుడ వాహనంపై కొలువుదీర్చి ఉత్సవం నిర్వహించారు. తల్పగిరీశుడిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ డీ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

12న జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 12న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెవెన్‌హిల్స్ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్ చిట్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, కెరీర్ స్కూల్, హెచ్‌ఆర్ సొల్యూషన్స్, పైసా బజార్, ఒమేగా హెల్త్‌కేర్, మిచ్ బిజ్ ఎడ్‌టెక్ సర్వీసెస్, తదితర కంపెనీలు జాబ్‌మేళాకు హాజరవుతున్నట్లు చెప్పారు. ప్రొడక్షన్ వర్కర్స్, సెల్‌ఫోన్ అసెంబ్లర్లు, పిక్కర్, వ్యాన్ డెలివరీ, మెషిన్ ఆపరేటర్లు, ఏజెంట్స్, యాక్టివేషన్, బిజినెస్ డెవలప్‌మెంట్, తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

ప్రత్యేకావసరాల పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి



నెల్లూరు(పొగతోట): ప్రత్యేకావసరాల విద్యార్థులు ఇతర విద్యార్థులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల వినియోగంపై శుక్రవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేకావసరాల విద్యార్థులకు విజన్-25లో భాగంగా ట్యాబ్స్ వినియోగంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. నూతన విజ్ఞానం, శాస్త్ర, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించి విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. అనంతరం రాష్ట్ర శిక్షకుడు ట్యాబ్‌ల వినియోగం,డౌన్‌లోడ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ కే పెంచలయ్య, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్, డాక్టర్ నరసింహులు, డాక్టర్ అబ్బినాయుడు, మల్లికార్జున్, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావుకు భారతరత్నపై హర్షం

నెల్లూరు(బృందావనం): మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడంపై ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారా శ్రీధర్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ప్రధానిగా పీవీ నరసింహారావు దేశానికి, ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివని కొనియారు. ఆయన సేవలను గుర్తించి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిన కేంద్రానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పవన్ ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

నెల్లూరు(మినీబైపాస్): జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి తాను సిద్ధమని ఆ పార్టీ నాయకుడు, కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదవుల కోసం కాకుండా ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు.

తిక్కవరప్పాడులో చోరీ

వెంకటాచలం : తిక్కవరప్పాడులోని కొప్పోలు నారాయణ నివాసంలో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. నారాయణ తన నివాసానికి తాళం వేసి పనినిమిత్తం గురువారం ఉదయం నెల్లూరుకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.7 వేల నగదు కనిపించలేదు. అలాగే పోస్టల్ కార్యాలయం తలుపులు పగులగొట్టి, అక్కడ నగదు లేకపోవడంతో వెళ్లిపోయారు.

ఎన్నికల సమరానికి సంసిద్ధం కావాలి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



సోషల్ మీడియా ప్రతినిధులతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): మాటకు కట్టుబడే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు రాబోయే ఎన్నికల సమరానికి సోషల్ మీడియా ప్రతినిధులు సంసిద్ధం కావాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లాని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతిపక్ష పార్టీలు జగనన్నపైన, ఆయన సంక్షేమ పాలనపై అవాస్తవాలు, ఆరోపణలు ప్రచారం చేసే అవకాశం ఉందన్నారు. సోషల్ మీడియా మిత్రులు వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సోషల్ మీడియా మిత్రులు సత్కరించారు. సోషల్ మీడియా ప్రతినిధులు గోగుల బాలఅంకయ్య, షేక్ షౌకాత్‌అలీ, పొంగూరు సుధాకర్, ఎండీ రఫీ, ప్రసాద్, హరికృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, నాయబ్, నరేష్, రఫీ, ఖాజా, బీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ



విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న సురేష్‌బాబు

నెల్లూరు (టౌన్): నులిపురుగులతో విద్యార్థుల్లో రక్తహీనత తలెత్తుతుందని, ఆల్బెండజోల్ మాత్రలతో వాటిని నివారించవచ్చని 20వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి తాళ్లూరి సురేష్‌బాబు పేర్కొన్నారు. కొండాయపాళెం దళితవాడలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోళ్లు కత్తిరించుకోకపోవడం, చేతులను శుభ్రం చేసుకోకుండా ఆహారం తినడం వల్ల నులిపురుగులు వస్తాయన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించడం వల్ల వాటిని నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ భాస్కరరావు, స్థానిక నాయకులు భాస్కరరెడ్డి, పద్మజాయాదవ్, ప్రసన్న, సువార్త, రసూల్, రాజ తదితరులు పాల్గొన్నారు.



బుజబుజనెల్లూరులో..

నెల్లూరు రూరల్: చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా సర్వజన వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బీ కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుజబుజనెల్లూరులో శుక్రవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నులిపురుగులతో చిన్నారుల్లో రక్తహీనత తలెత్తుతుందన్నారు. నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పీఎంపీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ షేక్ రసూల్, విశ్రాంత ఎస్సై సుధాకర్, శేషయ్య, శ్రీనివాసులు, నాగరాజు, అనిల్, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐతో పాటు ఇంటర్‌కు అవకాశం



మాట్లాడుతున్న ఐటీఐ కరస్పాండెంట్ రెహమాన్

నెల్లూరు (టౌన్): ఐటీఐ కోర్సులతో పాటు ఇంటర్ కోర్సును పూర్తి చేసే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని ఐటీఐ కరస్పాండెంట్ అబ్దుల్‌రెహమాన్ తెలిపారు. బీవీనగర్‌లోని కేఎన్నార్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఐటీఐ కోర్సులపై అవగాహన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐ ట్రేడ్‌ల్లో మూడు సబ్జెక్టుల్లోని ప్రతిభను ఓపెన్ స్కూల్ ఇంటర్ కోర్సుల్లోకి బదలాయించుకునే అవకాశం ఉందన్నారు. ఇంగ్లిష్ లేదా ఒక ప్రధాన గ్రూపు సబ్జెక్ట్‌ను ఎంపిక చేసుకుని ఉత్తీర్ణత పొందితే ఐదు సబ్జెక్టులతో కూడిన ఇంటర్ ఉత్తీర్ణతా పత్రాన్ని పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో స్కూల్ హెడ్‌మాస్టర్ విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగునని నెల్లూరుటౌన్ ఈఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని విద్యుత్‌సిబ్బందికి సహకరించాలని కోరారు.

- హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలోని హరనాథపురం, ఆదిత్యానగర్, చిల్డ్రన్స్‌పార్క్, అపోలో ఆస్పత్రి, సర్వేపల్లి కాలువ కట్ట, పార్థసారథినగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదు.
- రామూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామ్మూర్తినగర్, శ్రీనివాసఅగ్రహారం, బాలాజీనగర్, ఆదిత్యానగర్, జేమ్స్‌గార్డెన్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదు.
- వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరపురం, జనార్దన్‌రెడ్డికాలనీ, గాంధీగిరిజనకాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదు.

రేబాల ఆస్పత్రి సబ్‌స్టేషన్ పరిధిలోని రేబాలవారివీధి, పప్పులవీధి, ప్రకాష్‌నగర్, స్టోన్‌హౌస్‌పేట పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదు.

- జగదీష్‌నగర్, ఎన్టీఆర్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జగదీష్‌నగర్, రాంజీనగర్, ఎన్టీఆర్‌నగర్, ఎలమవారిదిన్నె పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదు.
- ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సుజాతమ్మకాలనీ, జీవీఆర్‌కాలనీ, లక్ష్మీనరసింహపురం, అంబేడ్కర్‌నగర్, కలెక్టర్‌బంగ్లా, రాజగోపాలపురం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదు.
- డీఆర్డీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని బృందావనం, సండేమార్కెట్, ట్రంక్‌రోడ్డు, కపాడిపాళెం, రెల్వేఫీడర్స్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదు.
- ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పోలీసు, రెవెన్యూ కాలనీల పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరా ఉండదు.
- ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్‌కాలనీ, జ్యోతినగర్, వేదాయపాళెం సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరా ఉండదు.
- ఇరుకాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలోని శివగిరికాలనీ, రాజీవ్‌గృహకల్ప, ఇరుకాళమ్మసంఘం, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదు.